ఎన్నారై ఆశాలతకు పురస్కారం ప్రదానం



పాత గుంటూరు: హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీ షిర్డీ సాయినాథ మందిరం ఆవరణలో తమ పూర్వ విద్యార్థిని ఆశాలతను శనివారం హరికథా విద్వాంసుడు తుర్లపాటి శంభయాచారి సన్మానించారు. కార్యక్రమానికి దేవాలయ గౌరవ అధ్యక్షుడు మామిడి రామారావు అధ్యక్షత వహించారు. ధార్మిక, సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న ఎన్నారై ఆశాలతకు శంభయాచారి తన పేరిట నెలకొల్పిన లలిత కళా పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. శంభయాచారి మాట్లాడుతూ లండన్‌లో స్థిరపడినప్పటికీ భారతీయ సంస్కృతి, సంగీతం, సాహిత్యంపై ఆసక్తితో పాటు దేశభక్తి, గురుభక్తిని కలిగిన శిష్యురాలు ఆశాలతని ప్రశంసించారు. అనంతరం ఘంటసాల పాటలను ఆశాలత ఆలపించారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి



పట్నంబజారు: లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని ఒకటవ జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.హెచ్. రాజగోపాల్‌రావు చెప్పారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, స్వాతి మహిళా సంఘ (బెంగుళూరు) ఆధ్వర్యంలో శనివారం న్యాయ సేవాసదన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సి.హెచ్.రాజగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్క మనిషి వారి హక్కులకు భంగం వాటిల్లినప్పుడు, ఏదైనా ఆపద సమయాల్లో న్యాయస్థానాలు, పోలీసు శాఖను ఆశ్రయించవచ్చని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, పోలీసుల బాధ్యతలు, స్వచ్ఛంద సంస్థల హక్కులను వివరించారు. ప్యానెల్ న్యాయవాది కట్ట కాళిదాసు న్యాయ విద్యార్థులకు న్యాయ సలహాలు, చట్టాల గురించి వివరించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ అనిత న్యాయ సేవాధికారిక చట్టాల గురించి వివరించారు.

కాయితి సైదారెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ

గుంటూరు మెడికల్: ఇటీవల మృతి చెందిన బీజేపీ సీనియర్ నేత, బీజేపీ బిల్డింగ్ కమిటీ చైర్మన్ కాయితి సైదారెడ్డి కుటుంబ సభ్యుల్ని శనివారం పలువురు బీజేపీ నేతలు పరామర్శించి తమ సంతాపం తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి సైదారెడ్డి సేవల్ని స్మరించుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, వల్లూరు జయప్రకాష్‌నారాయణ, సురేష్, రవికుమార్ ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన


మహిళకు కేర్ షీట్‌ను అందజేస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. శనివారం 56వ డివిజన్ పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. శిబిరం నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అయిుశెట్టి కనకదుర్గ, రామబోయిన అజయ్‌యాదవ్, యాట్ల రవి, మర్రి అంజలి, సత్యం పాల్గొన్నారు.

రోగికి ఇన్‌ఫెక్షన్ సోకకుండా జాగ్రత్త అవసరం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ నాగకిషోర్

గుంటూరు మెడికల్: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో రోగికి ఇన్‌ఫెక్షన్ సోకకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ఒమెగా క్యాన్సర్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్, చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎం.జి. నాగకిశోర్ సూచించారు. హాస్పిటల్ ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ అవైర్‌నెస్‌లో వీక్‌లో భాగంగా శనివారం స్థానిక మంగళగిరి రోడ్డులోని ఒమెగా క్యాన్సర్ ఆసుపత్రిలో డయాలసిస్, గ్యాస్ట్రో, పల్మనాలజీ, గైనకాలజీ, డయాబెటిస్, బయోమెడికల్, డైట్ కౌన్సిలింగ్ వంటి అంశాలతో ఎగ్జిబిషన్ నిర్వహించారు. డాక్టర్ నాగకిశోర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, ముఖ్యంగా నర్సింగ్ సిబ్బంది ఇన్‌ఫెక్షన్ కంట్రోల్‌లో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. రోగుల సహాయకులకు కూడా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య బృందం పాల్గొంది.

కాంట్రాక్ట్ గ్యారేజ్ బస్సులపై కేసుల నమోదు

పట్నంబజారు: దసరా పండుగను పురస్కరించుకుని నిబంధనలు పాటించకుండా తిరుగుతున్న కాంట్రాక్ట్ గ్యారేజ్ బస్సులపై ఆర్టీవో అధికారులు కేసులు నమోదు చేశారు. డీటీసీ షేక్ కరీం ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని 45 బస్సులపై కేసులు నమోదు చేయటంతో పాటు జరిమానాలు విధించారు. తనిఖీల్లో భాగంగా బస్సుల్లో అక్రమంగా తరలిస్తున్న సరుకులకు సంబంధించి 17 కేసులు, ప్రయాణీకుల వివరాల పట్టిక లేనివి 6, ఇతర నిబంధనలు పాటించని 22 కలిపి మొత్తం 45 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ దసరా పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని ఇష్టానుసారంగా నిబంధనలకు తిలోదకాలిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధిక చార్జీలు వసూలు చేసిన, ప్రయాణీకుల పట్టిక లేకుండా అధికంగా ప్రయాణీకులు ఉన్నా.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. కాంట్రాక్ట్ గ్యారేజ్ బస్సుల యజమానులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎంవీఐలు పాల్గొన్నారు.